ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 15, జనవరి 1975

# త్రిమూర్తులు

ఆ వేళ పరబ్రహ్మానికి శివం ఎత్తినట్టుగా ఉంది. అందుకే నిండు పున్నమి ఆయన్ని అమావాస్యగా కలవరపెడుతూంది. నక్షత్రాల మధ్య చంద్రుడు సమ్మెకు ఉరుకుతూన్న కార్మికుడులా కనిపిస్తున్నాడు. మూడో అంతస్తు మీద నుంచి కిందనున్న కొబ్బరి చెట్లు జుట్టు విరబోసుకున్న ఆడకూలీల్లాగా, చెట్లకి విరగ కాసిన కొబ్బరి పుందెలు విసరడానికి సిద్ధంగా ఉన్న నాటు బాంబుల్లాగా తోస్తున్నాయి. దూరంగా నిద్రపోతున్న ఇళ్ళు, ఆర్పని

దీపాలతో శ్మశానంలో కాలుతూన్న కళేబరాల్లా ఉన్నాయి. ఆఖరుగా భార్య పేర కట్టించిన 'సరస్వతీ టెక్స్‌టైయిల్స్' మెర్క్యురీ దీపాల మధ్య కాలిపోతున్న లంకానగరంలా కనపడ్డం మొదలుపెట్టింది.

పరబ్రహ్మం చప్పున కళ్ళు మూసుకున్నాడు. ఆయన పుట్టుకతోనే ఆస్తిపరుడు. ఆయనతోనే ఆస్తి కూడా ఎదుగుతూ వస్తూంది. ఆయన చదువు చిన్నప్పుడు కాన్వెంట్‌లో, కొంచెం మద్రాసులో నడిచి ఆ పైన అమెరికా వెళ్లి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డాక్టరేట్‌తో పరాకాష్ఠ చేరుకుని మేళతాళాలతో స్వదేశం తిరిగి వచ్చింది.

ఆయన అమెరికా నుంచి వట్టి చేతులతో రాకుండా బోలెడు విదేశీ ఊహల్నీ, గమ్మత్తయిన ఎత్తుగడల్నీ, దేశాన్ని నంజుకు తినేసే చమక్కులనీ జేబుల నిండా నింపుకుని మరీ వచ్చారు. పైగా అమెరికా సుందరి లారెల్‌ని కూడా తీసుకువచ్చాడు.

వారం రోజులు రెస్ట్ తీసుకుని ఊళ్ళో పెద్ద విందు చేశాడు. ఆ తరువాత మరో నెలకి బొంబాయిలో ఓ ఫైవ్ స్టార్ హోటల్లో రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడి కక్కడే చుట్టాల్లో పదిమంది బడా పెట్టుబడిదారులని షేర్ హోల్డర్స్‌గా చేసి తన స్వగ్రామంలో దేశం కనీ వినీ ఎరగని ఫ్యాక్టరీ కట్టబోతూన్నట్టు తెలియజేశాడు. దానితో దగ్గర చుట్టాల మొహాలు సూర్యుణ్ణి చూసిన పద్మాల్లా చేటంత అయ్యాయి. ముఖ్య బంధువులున్న ఊళ్ళలో చిన్న తరహా పరిశ్రమలూ, వాటిని అనుబంధంగా కుటీర పరిశ్రమలూ మొదలుపెడతామనీ చెప్పాడు. చంద్రుణ్ణి చూసిన నక్షత్రాల్లా ఈసారి దూరం చుట్టాలందరూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. మూడువంతుల ఉద్యోగాలు స్వజనానికి ఇవ్వడానికీ, ఒక వంతు అవీ చిల్లర మల్లర ఉద్యోగాలు పై వాళ్ళకి పంచడానికి ప్రమాణాలు చేసుకున్నారు.

పరబ్రహ్మం అందర్నీ పంపేసి, నలుగురు దగ్గర చుట్టాల్ని బొంబాయిలో తన గదిలోనే ఉంచి, వాళ్ళకి పగలు బార్లూ, బ్లూ సినిమాలూ, రాత్రుళ్ళు కాబరేలూ చూపించాడు. అమెరికాలో ధనవంతులు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోకుండా మరీ ధనవంతులవడానికి ఏం చేస్తారో, కిందా మీదా ఎలా పడతారో కాశీమజిలీ కథల్లోలా తేటతెల్లం చేశాడు. ఈ లోగా దేశం నాలుగు మూలలా ఉన్న నలుగురు స్నేహితులు అక్కడికి వచ్చారు. వాళ్లలో కొందరు బెల్‌బాటమ్ వేసుకున్న ఐరన్‌సేఫుల్లా, మరికొందరు ఖద్దరు బట్టలు కట్టుకున్న ఆల్సేషియన్లలా, ఇంకొందరు ట్వీడ్ సూట్లు తొడుక్కున స్వాముల వార్లలా ఉన్నారు. ఈసారి అంతా కలిసి దేశంలో కొన్ని ప్రాంతాల్లో దొంగనోట్లు అచ్చు వేసే తేలికరకం పరిశ్రమ చేపట్టాలనీ, చేబడితే పరిస్థితి ఎలా ఉంటుందనీ వాదించుకున్నారు.

పదేళ్ళు గిర్రున తిరిగాయి.

పరబ్రహ్మానికి కావలసినంత పేరూ, కావలసినదానికన్నా ఎక్కువగా డబ్బూ, ఒక ఎమ్.పి. పోస్టూ జమ అయ్యాయి. కొడుకు ఫణిభూషణం చేతి కంది వచ్చి, ఆ పైన ఫ్యాక్టరీకి జనరల్ మానేజరయి ఏడాదికి రెండుసార్లు కంపెనీ డబ్బు మీద ఫారిన్ టూర్లు

చేయగలిగే దిట్ట అయ్యాడు. ఒక కూతుర్ని స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మినిష్టర్ పోస్టులో ఉంటూ వస్తున్న ఘరానా వాడి కొడుక్కిచ్చి పెళ్ళి చేసి తన ఊరికీ, ఢిల్లీకీ చక్కని రాజమార్గం ఏర్పాటు చేశాడు. మరో కొడుకు ఇంగ్లండ్‌లో రీసెర్చి చేస్తున్నాడు. కూతురు లక్ష్మి బి.ఎ., పాసయి ఇంట్లోనే ఉంటూంది. రెండేళ్ళ క్రితమే – పోయిన తాతగారి పేరో కాలేజీ, తండ్రిగారి పేర పోలిటెక్నిక్కూ, శ్రీ వేంకటేశ్వరస్వామి పేర ఎలిమెంటరీ స్కూలూ స్థాపించాడు.

పరబ్రహ్మం ఈ నాడు – భూమంతా వేళ్ళు తన్ని పాతుకుపోయిన మర్రివృక్షంగా స్థిరపడ్డాడు.

అయితే, ఆయనకే చీకూ, చింతా లేవా? ఆయన్ని మించిన అదృష్టవంతుడు ఐదు ఖండాల్లో లేడా? ఆయన అజాతశత్రువా? అంటే కాదు. ఆయనకీ ఉన్నాయి సమస్యలు. స్విస్ బ్యాంక్‌లో దాచినా దాగని డబ్బు, భార్య పేర, కూతురూ అల్లుడూ, కొడుకూ కోడలు ఎవరి పేర మార్పిడి చేసినా తరగని డబ్బు, దొంగనోట్ల మార్పిడిలో చేజిక్కిన బంగారం – అన్నీ కలిసి పిశాచాల్లా మారి మా మాటేమిటని వేధిస్తాయి. ప్రతి తడవా జరిగే ఎలక్షన్లకి, తరచు జరిగే మధ్యంతర ఎన్నికలకి, పార్టీ డొనేషన్లకి, మంత్రుల విజిట్లకి, మందు పార్టీలకి డబ్బు ఖర్చుపెట్టడం చెడ్డ చిరాగ్గా ఉంది. షేర్ హోల్డర్స్ నల్లుల్లా తయారయి డబ్బు తాగేస్తూంటే చూస్తూ ఊరుకుందుకు ప్రాణం ఒప్పుకోవడం లేదు. ఇక వర్కర్స్ చీటికీ మాటికీ బోనసులనీ, బొందనీ సమ్మె నోటీసులు ఇవ్వడం, వాటిని తట్టుకుందుకు మంత్రుల దగ్గరి నుంచి మంగలి కాళ్ళ వరకూ పట్టడం, పోలీసు అధికారు లనుంచి గూండా గుర్నాథం వరకూ తినిపించడం యమయాతనగా ఉంది.

ఎప్పటికప్పుడు ఈ లాభాలు చాలు, ఐశ్వర్యం చాలు, ఏ ఫారినో పోయి హాయిగా ఉండాలనిపిస్తుంది. కానీ, మనసు చిల్లుకుండ లాంటిది. ఎన్ని కోరికలు తీరుతున్నా బేలమొహం వేసుకుని, 'ఇంకా ఏదో చెయ్యి, నువ్వింకా ఎదుగు' అని గీతోపన్యాసం చేస్తూనే ఉంటుంది.

అయితే, పరబ్రహ్మన్ని ఈ రోజు ఒక హిమాలయా సమస్య ఢీ కొట్టింది. అది గుర్తుకు వస్తే – రక్తం రసాయనిక మార్పులు చెంది నీళ్ళుగా మారి శరీరం అంతా సముద్రంలా ముంచెత్తుతూంది.

ముద్దుల కూతురు లక్ష్మి ఆఫీసు కేషియర్ విష్ణుమూర్తితో ప్రేమ కలాపాలు సాగిస్తూందని డ్రయివర్ చెప్పినప్పుడు ఆయన అపర హిరణ్యకశిపుడే అయ్యాడు. డామిట్, ఇడియట్ అని తిట్టాడు. రాజారామ్ మాత్రం అదేం వినిపించుకోకుండా వాళ్ళిద్దరి రహస్య సమావేశాల ప్రత్యక్ష వ్యాఖ్యానం మొదలుపెట్టాడు.

"ఈ విషయం మరెక్కడయినా పొక్కిందో నువ్వు చచ్చావే" అంటూ నోటితో వార్నింగిచ్చి, చేత్తో మాత్రం వంద కాగితం అందించాడు. సరాసరి ఇంటికి వచ్చి లక్ష్మిని ఇంగ్లీష్‌లో

గడగడా తిట్టాడు. లక్ష్మి తక్కువేం తినలేదు. తనూ ఇంగ్లీషులో పెద్ద నెరేషన్ ఇచ్చి ఆఖరిగా 'ఐ లైక్ హిమ్' అంటూ తేల్చింది.

"అన్నయ్యా, అక్కయ్యా నీలా మాట్లాడారా"

"వాళ్ళకీ నాకూ మధ్య పదేళ్ళ దూరం ఉంది".

"పోనీ నీ స్టేటస్ ఆలోచించావా?"

"నా స్టేటస్ అంతా నీ డబ్బుతో వచ్చిందే!! అందుకే నన్ను మింగేసే గౌరవం నాకొద్దు..."

"నువ్వలా అనడానికి వీల్లేదు. నలుగురూ నా వెనకే నవ్వుతారు. పరబ్రహ్మం కూతురు లోఫర్‌ని ప్రేమించిందని వేళాకోళం చేస్తారు."

లక్ష్మి ఆత్మాభిమానం దెబ్బతింది. అందుకే అంది : "అతను నీ పాటి డబ్బున్న వాడు కాదని నువ్వతన్ని లోఫర్ అంటున్నావు. అంతేకదా, నాన్నా. ఈ దేశంలో డబ్బున్న వాళ్ళు ఆ డబ్బెలా గడిస్తున్నారో తెలియని వాళ్లు లేరు. కానీ, వాళ్లు నోరుమూసుకుని ఊరుకుంటారు. దానికి కారణం మీరంటే భయం కానీ భక్తి కాదు. నీకోసం మనింటికి వచ్చేవాళ్ళలో స్మగ్లర్స్‌ని, దొంగనాయకుల్ని, ట్రెయినర్స్‌ని నేను చూపించగలను, నాన్నా..."

"నోర్ముయ్."

"అందుకే, నాన్నా, విష్ణుమూర్తిని మన మెట్టు మీదికి ఆహ్వానిద్దాం."

"ఇంపాసిబుల్."

లక్ష్మి నవ్వేసింది. "ఈ మెట్లు ఇలాగే ఉండిపోవు. ఏదో రోజు సమతలం కాక తప్పదు. ఇరవై ఏళ్ళ క్రితం తాతయ్యా, పదేళ్ళ నుంచి నువ్వూ ఎన్నో ఘనకార్యాలు చేయబట్టే మనం విష్ణుమూర్తి వాళ్ళ మెట్టు మీది నుంచి పైకి వచ్చాం. వాళ్ళకీ తెలివితేటలు ఉంటాయి..."

"నో, నో, ఐ కాన్ట్. యూ కెనాట్ మేరీ హిమ్."

"ఐ కెన్..." లక్ష్మి తన గదిలోకి వెళ్ళిపోయింది. పరబ్రహ్మం అగ్నిపర్వతం అయ్యాడు.

విష్ణుమూర్తిని పిలిచి చీవాట్లు పెట్టాలా, లేక తన మనుష్యుల చేత తన్నించాలా, అదీకాకుండా కొంతడబ్బిచ్చి ఆ ఊరి నుంచే తరిమేయడమా, ఏం చేయాలి, చేస్తే ఎలా చేయాలి??

అందుకే మేడ మూడో అంతస్తు మీద నించున్నా, ఆయనకి పాతాళంలోకి పోతూన్నట్టుగా ఉంది.

అప్పుడు ఆయనకి తన లక్షల ఆస్తి, ఊళ్ళో మెరికల్లాంటి బంధుకోటి, హోదా అన్నీ గుర్తుకొచ్చాయి.

తనేమన్నా చేయగలడు. తన డబ్బు ఏమన్నా చేయగలదు. అటువంటిది ఓ సామాన్య మానవుడు కల్పించిన కలతకి కలవరపడ్డమా!! ఉహూఁ.

ఆయనలో అహంకారం, ఆవేశం, దర్పం, ధనమదం అనేకానేక అసామాన్య సలహాలు

ఇవ్వడం మొదలెట్టాయి.

❖ ❖ ❖

ఊరి చెరువు గట్టున విష్ణుమూర్తి తల కింద చెయ్యి పెట్టుకుని ఏకాకి అయిన శ్రీ మహావిష్ణువులా పడుకున్నాడు. ఆకాశం మీదికి జట్లుజట్లుగా వస్తూన్న నక్షత్రాలు డ్యూటీకి వస్తూన్న కార్మికుల్లా ఉన్నాయి. విష్ణుమూర్తి ఊరివైపు చూశాడు. ఊళ్ళో మేడల మధ్య చిక్కుకున్న తన పెంకుటిల్లు రౌడీలు చుట్టు ముట్టిన పడుచుపిల్లలా, ఊరికి దూరంగా ఉన్న సరస్వతీ టెక్స్టయిల్స్ వికటాట్టహాసాల్తో నరభక్షణ చేస్తూన్న బ్రహ్మరాక్షసిలాగా కనిపించాయి.

విష్ణుమూర్తి లేచి కూర్చున్నాడు. అప్పటికే అతని మెదడు ఆలోచనలతో ఉండలు చుట్టిన ఉల్లిపొర కాగితంలా ఉంది. ఎంత మరిచిపోదామనుకున్నా పరబ్రహ్మం మాట్లాడిన మాటలు గుర్తొస్తున్నాయి. దానితో కళ్ళు నిప్పు రవ్వల్లా చిటపటలాడ్డం మొదలుపెట్టాయి. నిజమే – విష్ణుమూర్తి తండ్రి ఇరవై ఏళ్ళ నాడు ఏభై ఎకరాల ఆసామీ, పుట్టుకలకీ, చావులకీ, విందులతో లేనిపోని దర్పాలతో ఇల్లు సగం గుల్లయింది. నలుగురు కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేశాడు. ఆ దెబ్బతో ఫకీరు కూడా అయ్యాడు. ఇంటికి వచ్చే బంధువుల సంఖ్య తగ్గి ఇంటి ముందుకు వచ్చి అరిచే అప్పులవాళ్ళ జనాభా పెరిగింది. ఈ లోపునే ఇద్దరు కూతుళ్ళ విధవలయి పుట్టింటికి గుదిబండలై చేరడం, సంసార చక్రాన్ని తిప్పే బాధ్యత వారసత్వంగా విష్ణుమూర్తి భుజాల మీదికి ఉరకడం ఒకేసారి జరిగాయి. మరో దారి లేక ఇరవై ఏళ్ళ విష్ణుమూర్తి బి.ఎ. పట్టాతో, అసంతృప్తితో, ఆవేదనతో ఉద్యోగపు వేటలో పడ్డాడు.

ఒకప్పుడు రామయ్య, పరబ్రహ్మం ఆ ఊరి ఎలిమెంటరీ స్కూల్లో కలిసి చదువుకున్నారు. ఒకే వీధిలో ఆడుకున్నారు. అందుకే రామయ్య పాత పరిచయాన్ని పంచెగా కట్టుకుని, నామర్దా చిరుగుల చొక్కా మీద స్నేహం కండువా కప్పి, కొడుకు ఉద్యోగం కోసం పరబ్రహ్మం దగ్గరికి వెళ్ళాడు. సౌరమండలంలోని నక్షత్రం భూగోళం మీది అగడ్తని చూసినట్టు, పరబ్రహ్మం రామయ్య వైపు చూశాడు.

రామయ్య చేసిన ప్రార్థనలు, పొగిడిన పొగడ్తలు, వేడికోళ్ళు విని ఆ పైన ఆయన కళ్లు కన్నీరు కార్చేవరకూ పరీక్ష చేసి ఆఖరుగా సరే అన్నాడు.

"మీ నాన్న మొహం చూసి నీకు ఉద్యోగం ఇచ్చాను. ఇదే మరొకళ్ళయితే సున్నంలోకి ఎముకలు దొరికేవి కావు". పరబ్రహ్మం విష్ణుమూర్తిని కబురు చేసి అన్న మొదటి మాట అది.

విష్ణుమూర్తి జవాబు చెప్పలేదు.

"కోటీశ్వరుడి కూతుర్ని పెళ్ళి చేసుకుందుకు అర్హత కావాలి. మూడు వందల జీతగాడికి మామగారి నవడం నాకు కాదు తలవంపులు, చరిత్రకీ జాతికీనూ. పులి తోటి పులులతోనే

తిరుగుతుంది. మేక మేకల మధ్యే బ్రతుకుతుంది. ఇది నువ్వు తెలుసుకోవలసిన సత్యం. అలాగే మధ్య తరగతి వాళ్ళ ప్రేమలు వాళ్ళ తరహా మనుషులకే పరిమితం అవ్వాలి. నీలాంటి వాడు మేడల వాడితో రాసుకు తిరగాలనుకుంటే అది కొడవలికీ, కంకికీ ఉండే చుట్టరికమే అవుతుంది. ఇంకెప్పుడూ మా అమ్మాయి జోలికి రాకు. ఇంకోసారి ఇలాంటి పొరపాటు పని చేశావో నీ ఇంటికి నిప్పెట్టిస్తాను. నీ చెల్లెళ్ళని, అక్కల్ని...."

పరబ్రహ్మం వెళ్ళిపోయాడు. విష్ణుమూర్తికి తల దిమ్మెక్కిపోయింది. అంతమాత్రం చేత పరబ్రహ్మం విరాట్ స్వరూపం చూసి అతనేం దడుసుకోలేదు. ఆయన అహంకారం, పోజూ, మాటతీరూ అతనికేం కొత్త కావు. రోడ్డు మీద నడుస్తూ అందరికన్నా ప్రత్యేకంగా నడుస్తూన్నట్టు తాహతు చూపులు విసరడం, కారెక్కుతూ కారు చూపులు చూడ్డం, విమానం ఎక్కుతూ విమానపు చూపులు చూడ్డం - ఇలా రకరకాలుగా అభినయించగల మేటి నటుడు పరబ్రహ్మం.

ఇక ఆయన అన్న మాటలూ, అల్లుడుగా పనికిరావని చెప్పిన థియరీ విష్ణుమూర్తికి ఛాలెంజ్‌గా తోచింది. తను దేశంలోని ధనవంతుల్లో ఒకడిననే గర్వం, మిగిలిన జనాభా జీవితాల్ని శాసించే హక్కు తన లాంటి వాళ్ళకి మాత్రం ఉంటుందని సూత్రీకరించడం విష్ణుమూర్తిలో పౌరుషాన్ని రెచ్చగొట్టాయి.

ఆ క్షణంలో అతని హృదయం అవమానం చేత కాకుండా ప్రతీకారంతో నిప్పులో కాలే ఇనుపమక్కలా మండడం మొదలుపెట్టింది.

పరబ్రహ్మం నిజస్వరూపం చాలా మందికన్నా విష్ణుమూర్తికి బాగా తెలుసు, వ్యాపారంలో పరబ్రహ్మం చేసే మోసాలు, దొంగచాటుగా తీస్తూన్న లాభాల లెఖ్ఖలు ప్రభుత్వానికి చూపించే లెఖ్ఖలు అన్నీ తెలుసు.

పరబ్రహ్మంతో ఈలాంటి భేటీ తప్పదని లక్ష్మితో పరిచయం అయిన నాడే అతను ఊహించాడు. అందుకే తన జాగ్రత్తలో తను ఉంటూ వచ్చాడు. పైగా ఆ మధ్యాహ్నమే ఈశ్వర్‌కి కబురు చేశాడు, సాయంత్రం ఊరి బయట చెరువు దగ్గర కలుసుకోమని. ఈశ్వర్ సరస్వతీ టెక్స్‌టైయిల్స్ వర్కర్స్ యూనియన్‌కి సెక్రటరీ. తన నిజాయితీతో, సేవతో కార్మికులకు అతను తలలో నాలిక. కార్మిక లోకం ఈశ్వర్ మాట వేదవాక్కుగా పాటిస్తుంది. దూరం నుంచి ఈశ్వర్ రావడం చూసి విష్ణుమూర్తి ఎదురువెళ్ళాడు. "మీకు కబురు అందిందో లేదోనని భయపడుతున్నా" అంటూ నమస్కారం చేశాడు.

ఈశ్వర్ చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేశాడు.

విష్ణుమూర్తి అతని యోగక్షేమాలు అడిగాడు. ఇంటి విషయాలు అడిగాడు. కార్మికుల స్థితిగతుల మీదా, వారి జీవన ప్రమాణాల మీదా, కార్మికుల జీతభత్యాల మీదా తన అభిప్రాయాల్ని ఏకధాటిగా చెప్పాడు. "మన ఫ్యాక్టరీలో మటుకు జీతాలు పెరగవండీ. ఎవరిని చూసినా అసంతృప్తి, పని తీసుకునే పెద్దలకీ, అటు ప్రభుత్వానికీ కూడా

కార్మికులంటే లక్ష్యం లేదు. కానీ, చూడండి, పేపర్లలో కార్మిక సంక్షేమం గురించి మాట్లాడని నాయకుడుండడు" ఈశ్వర్ నిరాశగా అన్నాడు.

విష్ణుమూర్తి నవ్వేశాడు. "చూడు, ఈశ్వర్, ప్రభుత్వం అనగానే దానికేవో పొడిచేసే ఆదర్శాలూ, నీతి నిజాయితీలూ ఉండి చస్తాయనుకోవడం మన భ్రమ. ఏ ప్రభుత్వమయినా సరే, కుండీలో పెరిగే మొక్కలాంటిది. పాలితులు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకునే పాలిస్తారు. ప్రభుత్వం పదికాలాల పాటు బ్రతకాలంటే మనలాంటి వాళ్ళ సహకారం లేకపోయినా నష్టం లేదు. కానీ, పరబ్రహ్మం లాంటి డబ్బు గల ఆసాములే వాళ్ళకి శ్రీరామరక్ష. అల్లర్లు, అలజడులు, ఎలక్షన్లు - వీటిని ఆపాలన్నా, నడపాలన్నా ముందు డబ్బు కావాలి. తన బూర్జువా మనస్తత్వాన్ని కప్పి పుచ్చుకుందుకు ఏ దేశంలో అయినా సరే, ప్రభుత్వం నోటితో ప్రజల తరపున మాట్లాడుతుంది. అవసరానికి మాత్రం పై మెట్టు మనుషులతోనే చేతులు కలుపుతుంది."

"అయితే, మన గతేమిటంటారు?"

"ఆకలయితే అడగటం, అది తీరకపోతే ఏడవడం, ఆవేశం వస్తే సమ్మె కట్టడం, మనవాళ్ళే విభేదాలు సృష్టిస్తే మనలో మనం కొట్టుకు చావడం, సమ్మెకి గోరీ కట్టడం - ఇదీ ఈ దేశంలో మినీ సైజు రూపం."

ఈశ్వర్ ఒళ్ళు మరిచి నవ్వేశాడు క్షణం.

ఈశ్వర్ పెద్దగా చదువుకున్నవాడు కాదు. అతని తాతతండ్రులు కూడా చిన్న ఉద్యోగాలు చేసిన వాళ్ళే. తండ్రి మాత్రం ఇల్లు వదిలి ఊళ్ళమ్మట తిరిగేవాడు. మాటకి ముందు, లెనిన్ ఇలా అన్నాడు, అజయఘోష్ ఉద్దేశం ఇదీ, సుందరయ్యగారి దృక్పథం ఈ విధంగా ఉంటుందీ అంటూ ఉండేవాడు. లేనివాళ్ళనీ, ఉన్నవాళ్ళనీ తేడా పోనిదే దేశానికి మోక్షం లేదనేవాడు. రష్యా విప్లవం, ఫ్రెంచి విప్లవం తాలూకు తెలుగు అనువాదాలూ, మహాప్రస్థానం, కొడవటిగంటి నవలలూ, సుంకర నాటకాలూ తెచ్చి ఈశ్వర్‌కి ఇచ్చేవాడు. అతను ఆ పుస్తకాలే చదివాడు. దానికి తోడు సంఘంలో బాగా తిరగడంతో అతనికి సహజంగా చుట్టూ వాళ్ళ బాధల్ని పంచుకునే నైజం అలవడింది. ప్రతిదీ పరీక్షగా ఆలోచించి అవగాహన చేసుకునేవాడు. ఒక్కొక్కసారి అతనికి సమాజపు నడకలో ఏదో కనపడని కుంటితనం ఉందనిపించేది. చాలామందిలో నీతి నిజాయితీలంటే గౌరవం లేకపోగా, అవంటే నిర్లక్ష్యం కూడా ఉండడం గమనించాడు. అప్పటి నుంచే అతను చాలా విషయాలకి తన మనసునే ప్రమాణంగా తీసుకోవడం నేర్చుకున్నాడు.

విష్ణుమూర్తి తొమ్మిది గంటలు కొట్టేవరకూ పరబ్రహ్మం, అతని అంగరక్షకులూ చేసే మోసాల గురించి చెప్పాడు. తన దగ్గర ఉన్న లెఖ్ఖలో కొన్ని మచ్చుగా చూపించాడు. ఈశ్వర్‌కి ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. మరో రెండు రోజుల్లో కార్మిక ప్రతినిధులందరికీ ఈ విశేషాలన్నీ చాలా మటుకు తెలిశాయి. వారం తిరిగేటప్పటికీ కార్మికుల్లో ఆశించిన

దానికన్నా ఎక్కువ వేడి పుట్టుకొచ్చింది. స్ట్రైక్ నోటీసు జారీ అయింది. దానితో విష్ణుమూర్తికి తన పాగా కోటలో పడ్డట్టే అయింది. అదే సమయంలో ప్రముఖ పత్రికల్లో సరస్వతీ టెక్స్‌టయిల్స్ లొసుగులు పెద్ద పెద్ద శీర్షికలతో రావడం మొదలుపెట్టాయి.

అటు పరబ్రహ్మం మనసు లోతుకుపోతున్న జెయింట్ షిప్‌లా అదరడం, ఇటు విష్ణుమూర్తి మనసు పగతో బుసలు కొట్టడం జరుగుతూంది.

విష్ణుమూర్తి గర్వంగా నవ్వుకున్నాడు. మధ్యతరగతి మనిషి సంఘాన్ని గుప్పిట్లో బంధించలేకపోవచ్చు. కానీ, అతని మేధ శతకోటి కిరణాల భానుడి ప్రతిరూపం. అతను ఆధునిక కుంభకర్ణుడు. ఓ పట్టాన నిద్ర లేవడు. లేచాడో పట్టపగ్గాలు ఉండవు.

❖ ❖ ❖

సమ్మె మొదలయి పది రోజులయింది. ఫ్యాక్టరీ వాతావరణం వాడిగా వేడిగా ఉంది. ప్రభుత్వం సమ్మె చట్ట విరుద్ధమని నిర్ణయించింది. దానితో ఆ పరిసరాలన్నీ 144వ సెక్షన్ ఆక్రమించుకుంది.

నగలన్నీ పీకీ పారేసి, నల్లచీర కట్టుకుని కోపగృహాన్ని అలంకరించిన సత్యభామలా ఉంది సరస్వతీ టెక్స్‌టయిల్స్.

ఈశ్వర్ ఒక్కడూ యూనియన్ ఆఫీసు డాబామీద కూర్చున్నాడు. ఉండి ఉండి ఎగురుతూన్న యూనియన్ పతాకం ప్రమిదలో కదులుతున్న దీపశిఖలా చిరుగాలికి ఊగుతూంది. ఆకాశం దట్టంగా కమ్మిన మబ్బుతో అంధనగరంలా ఉంది.

ఈశ్వర్ ఆలోచనలు చిక్కులు పడిన దారాల్లా ఉన్నాయి.

రెండు రోజుల నాడు పరబ్రహ్మం పంపిన మధ్యవర్తి శ్రీనివాసన్‌గారు ఇంటికి వచ్చి, డబ్బు ఎరగా చూపి, సమ్మె విరమించుకోమని సలహా ఇచ్చాడు. ఇవ్వబోయే ప్రమోషన్‌ని వర్ణించబోయాడు. ఈశ్వర్‌కి కోపానికి బదులు నవ్వు వచ్చింది. ఆశ్చర్యం కాక అసహ్యం వేసింది.

“మీరు నన్ను తప్పుగా అంచనా కట్టారు. సమ్మె నా ఒక్కడి కోసం చేస్తున్నది కాదు. ఇది మూకుమ్మడి సమస్య. వాళ్ళ భవిష్యత్తు మీద నేను దెబ్బ కొట్టలేను.”

“నీ కుడి భుజం అంటావు చూడు, వెంకటేశ్వర్లు ఇరవై మంది వర్కర్లతో లోపల పనిచేస్తున్నాడు. వాడికి లేని నీతీ, ఎవడికీ పట్టని....”

ఈశ్వర్ కోపంగా అనేశాడు : “నాకన్నీ తెలుసు. మీరు వెళ్ళండి.” శ్రీనివాసన్ వెళ్ళిపోయాడు.

మరునాడు ముకుందం వచ్చి దొంగచాటుగా ఫ్యాక్టరీకి వెళ్ళిన వాళ్ళ లెఖ్ఖలు చూపించాడు.

“నిజం, గురువుగారూ, ఏభై మంది దాకా లోపల పని చేస్తున్నారని వార్త. వాళ్ళ వెనుక వెంకటేశ్వర్లు ఉన్నాడని అనుమానం.”

ఈశ్వర్ ఆ సంగతే ఆలోచిస్తున్నాడు. తనెక్కడా పొరపాటు చేయలేదు. అందరి సమ్మతి

మీదే సమ్మెలోకి దిగాడు. వర్కర్లలో చీలికలూ, అపనమ్మకం పుట్టించడానికి మానేజ్‌మెంటు ప్రయత్నిస్తుందని అందరికీ తెలుసు. డబ్బు వెదజల్లుతారని, కాదు ఎర చూపిస్తారని కూడా తెలుసు. స్వార్థంతో ప్రతివాడూ లొంగిపోతాడు. అప్పుడే జనం మొత్తానికి దెబ్బ తగలడం మొదలవుతుంది.

రెండు రోజులుగా ఈశ్వర్ విష్ణుమూర్తి గురించి ఎదురు చూస్తున్నాడు. ముకుందాన్ని వాళ్ళింటికి పంపాడు కూడా.

"ఈ సమయంలో విష్ణుమూర్తిగారుంటే మంచిది. వెంకటేశ్వర్లు ఆయన మాట కాదనడు. పైగా మనకి నిజానిజాలు తెలుస్తాయి."

ముకుందం నెమ్మదిగా అన్నాడు: "ఎప్పుడు వెళ్ళిన ఆయనగారు ఇంటి దగ్గర దొరకడం లేదు."

"ఎక్కడికి వెళ్లారో?" ఈశ్వర్ విసుగ్గా అన్నాడు.

"ఓ మాట చెప్పమంటారా?"

"విష్ణుమూర్తిగారిని మనం మరీ ఎక్కువగా నమ్ముతున్నాం."

"అంటే?"

"మనం వేసే ప్రతి అడుగూ ఆయన్ని అనుమానిస్తున్నవా?"

"రేపు ఆయన గురించి ఖచ్చితంగా మీకు చెపుతాను." ముకుందం ఎక్కడో చూస్తూ అన్నాడు.

❖ ❖ ❖

ముకుందం రొప్పుకుంటూ వచ్చాడు.

"గురువుగారూ, మన విష్ణుమూర్తి గారిని ఎవరో బాగా కొట్టారట. ఆయన చావు బ్రతుకుల్లో ఉన్నాడంటున్నారు"

"అలానా?" ఈశ్వర్ కంగారుగా లేచాడు.

ముకుందం ఈశ్వర్ చెయ్యి పుచ్చుకుని "మీరు నమ్మండి, నమ్మకపొండి, మానేజ్‌మెంట్ ఈ కొట్లాటలో మిమ్మల్ని ఇరికించాలని చూస్తూంది" అన్నాడు.

ఈశ్వర్ నవ్వేసి అన్నాడు : "భయం లేదు. పద, ఆయన్ని చూసొద్దాం".

"ఇద్దరూ వెళ్ళేసరికి విష్ణుమూర్తిని పట్నం ఆసుపత్రికి తీసుకువెళ్ళారని చెప్పారు. జనం కూడా ఆ కొట్లాట గురించి రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ముకుందాన్ని పంపేసి ఈశ్వర్ యూనియన్ ఆఫీసుకు వచ్చేసరికి అతనికి వాకిట్లో ఇద్దరు ఆడవాళ్లు కనిపించారు. అతను వాళ్ళిద్దర్నీ అంతకుముందు చూడలేదు. వచ్చింది నిజానికి లక్ష్మి, ఆమె స్నేహితురాలు నిర్మలా.

"మీరూ?" అన్నాడు.

"మేం ఎవరమో తరువాత చెపుతాను. మీతో పెర్సనల్‌గా మాట్లాడాలి."

"నేను ఈయనతో మాట్లాడి వస్తాను, నువ్విక్కడే ఉండు, నిర్మలా."

ఈశ్వర్ డాబా మీదికి దారి చూపించాడు. ఈశ్వర్ బరకం మీదా, లక్ష్మి చాపమీద ఓ మూలగానూ కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి, మీ సమస్యలేమిటో."

లక్ష్మి తల వంచుకనే చిన్నగా నవ్వుకుంది. ఆ పైన "ముందు ఈ విషయం చెప్పండి. మీరు విష్ణుమూర్తిని నమ్ముతారా?' అంది.

ఈశ్వర్ క్షణం ఆలోచించి అన్నాడు. "అలా అడిగారేం?" అని.

"విష్ణుమూర్తి మీకోసం దెబ్బలు తిని హాస్పిటల్ పాలయ్యాడనుకుంటున్నారు కదూ?"

"అవును, అతను మా వైపు మనిషి. అందుకే అతన్ని కొట్టి ఉంటారు."

"అయితే, నిజం చెపుతున్నాను, వినండి. విష్ణుమూర్తి మీ మనిషి కాదు. మొదట్లో అతను మీకేదో సహాయం చేసి ఉండచ్చు. కాని, ఇప్పుడాయన మానేజ్‌మెంట్ పక్షం. అది చెప్పడానికే వచ్చాను."

"మిమ్మల్ని ఎలా నమ్మేది? ఇదీ వాళ్ళ ప్లానే కావచ్చుగా?" ఈశ్వర్ లక్ష్మిని సూటిగా చూస్తూ అన్నాడు.

లక్ష్మి తల వంచుకుంది. "కాదనడం లేదు. కానీ, మీకు ఈ సమయంలో నిజమైన స్నేహితులెవరో తెలియడం మంచిది. మరో విషయం. అతన్ని ఎవరూ కొట్టలేదు. హాస్పిటల్లో లేనూ లేరు. ఇదో గూడుపుఠాణీ."

"ఇంతకీ మీరూ...."

"నేను పరబ్రహ్మంగారి అమ్మాయిని. ఇప్పుడు నమ్ముతారా నా మాట?" ఈశ్వర్ బొమ్మలా ఉండిపోయాడు.

❖ ❖ ❖

లక్ష్మి, నిర్మలా ఈశ్వర్‌తో మాట్లాడి సరాసరి సినిమాహాలుకి వెళ్ళారు. నిజానికి రెండో ఆట సినిమా మిష మీద ఈశ్వర్‌ని కలుసుకోవాలన్నది లక్ష్మి పథకం.

లక్ష్మి సినిమా చూడ్డంలేదు. ఆమె ఆలోచనల్లో తండ్రి, విష్ణుమూర్తి, ఈశ్వర్ – వాళ్ళు ముగ్గురే తిరుగుతున్నారు. ఈశ్వర్‌తో మాట్లాడిన తరువాత లక్ష్మికి కొంత ఆరాటం, ఆవేదనా తగ్గాయి.

విష్ణుమూర్తితో తన స్నేహాన్నీ ప్రేమనీ తండ్రి తేలిగ్గా కొట్టి పారేసినందుకు, తనని బంగారు పంజరంలో చిలకగా పోల్చినందుకు లక్ష్మికి బ్రతుకంటే విరక్తి కలిగింది. తండ్రి వెళ్ళి విష్ణుమూర్తిని బెదిరించడం, అవమానించడం ఆమెకు మరింత దుఃఖాన్నే పంచింది.

అయితే, ఒక వారంగా తండ్రికి ఎదురయిన సమస్యలు, ఫాక్టరీలో వచ్చిన మార్పులు ఆమెకు కొంత ఊరట కలిగించాయి. విష్ణుమూర్తి వర్కర్ల వెనుక నిలబడి తండ్రిని సవాల్ చేయడం సంతోషంగా ఉంది.

విష్ణుమూర్తి వ్రాసిన ఉత్తరం మళ్ళీ మళ్ళీ చదువుకుంది.

"మీ నాన్నగారికీ, నాకూ మధ్య వర్గ పోరాటం జరుగుతూంది. ధనవంతుడు కాబట్టి ఆయన మేం కల్పించిన కష్టాల్ని తన అంగబలంతో ఢీకొని మమ్మల్ని చిత్తుగా ఓడిస్తే అందులో ఆశ్చర్యం ఏం ఉండదు. ఇది ఈ దేశంలో నిత్యక్రతువే! కానీ, ఒకవేళ మా పక్షానికి విజయం లభించిందో, అది చరిత్ర గతిని మార్చకపోయినా, ఈ రోజుల్లో కూడా గుడ్డి నమ్మకాలకి విలువ లేదని ఋజువు చేస్తుంది.

-విష్ణుమూర్తి."

విష్ణుమూర్తి తనకి దక్కకుండా పోతూన్నందుకు ఆ క్షణంలో లక్ష్మి బాధ పడలేదు. తగిలిన ఒక్క దెబ్బతో కొందరు అంతుపట్టకుండా పోతారు. మరికొందరు రాటుదేలి మరింత ప్రకాశించడం మొదలుపెడతారు. ఓటమి వాళ్ళని వెనక్కి కాకుండా ముందుకే నడిపిస్తుంది. అయితే, ఆ రాత్రే ఆమె ఆశలకీ, నమ్మకాలకీ, ఎదురుదెబ్బ తగిలింది. తండ్రి పిలిస్తే హాల్లోకి వెళ్ళింది.

"రా లక్ష్మీ, కూర్చో."

"ఏమిటి, నాన్నా?"

"ఏం లేదమ్మా. నాకు కొంచెం మనశ్శాంతిగా ఉంది. బెంగపోయింది."

లక్ష్మి తండ్రి వైపు చూసింది ఏం చెపుతాడా అని.

"విష్ణుమూర్తి ఓ గంటలో మనింటికి వస్తానన్నాడు."

"దేనికో?"

"అతన్ని నేను తప్పుగా అంచనా వేశాను. నువ్వు చెప్పినప్పుడే అర్థం చేసుకుని ఉంటే... ఈ గొడవలు ఉండేవి కావు."

"అసలేం జరిగింది, నాన్నా?"

పరబ్రహ్మం నవ్వేశాడు. 'డబ్బు, లక్ష్మీ, అంతా డబ్బులో ఉంది. విష్ణుమూర్తి మనవాడు."

లక్ష్మికి నెత్తిమీద పిడుగులు పడుతూన్నట్టుగా ఉంది.

"అరగంటలో అతనొస్తాడు, నీతో మాట్లాడతాడు." పరబ్రహ్మం మేడ మీదికి వెళ్ళిపోయాడు.

పావు గంటలోనే విష్ణుమూర్తి వచ్చాడు. తెల్లసంచీ, తెల్ల లాల్చీ వేసుకున్నాడు. గుమ్మంలోంచే చిరు దరహాసం చేస్తూ వస్తూంటే లక్ష్మికి అతను తెల్లపులిలా కనిపించాడు.

"లక్ష్మీ..." అన్నాడు. లక్ష్మి మాట్లాడలేదు.

"నే నేం చేశానో తెలుసా?"

"ఏం చేశావుట!"

"మీ నాన్నని ఓడించాను"

లక్ష్మి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అంది: "లేదు, మూర్తీ. నువ్వే ఓడింది. పిరికివాడిలా

వెనక్కి పరుగెత్తావు."

"వేళాకోళం చేస్తున్నావా?"

"నిజంగా అంటున్నాను. నువ్వేం చేశావో తెలిసే చేశావా?"

"అంటే?"

మా నాన్న నిన్నటి వరకూ నిన్ను పురుగుకన్నా హీనంగా చూశాడే –ఆయన వలలో ఎలా పడ్డావు? డబ్బున్న వాళ్ళు నీలాంటి జనాన్ని అణిచి పెడుతున్నారని రంకెలు వేశావే... ఏమయింది నీ ఆదర్శం?

"అదేమిటి, లక్ష్మీ, నిన్ను పెళ్ళి చేసుకుందుకు, మీ నాన్నగారు..."

"నన్ను పెళ్ళి చేసుకుందుకు నీ వ్యక్తిత్వాన్ని అమ్ముకుంటావా?"

విష్ణుమూర్తి హాలు అదిరేలా నవ్వాడు. ఆ నవ్వు సింహగర్జనలా ఉంది.

"ఇందులో వ్యక్తిత్వం అమ్ముకోవడం ఏం లేదు. నా సంగతి తెలియక ఆయన ఏవేవో అన్నారు. ఇప్పుడు కాళ్ళబేరానికి వచ్చారు. అంతే."

"మరి ఈశ్వర్ వాళ్ళ మాటేమిటి? వాళ్ళని సమ్మెకి పురికొల్పింది నువ్వు కాదా?"

"అవసరానికి ఓ ఆయుధం ప్రయోగించాం. వాళ్ళ గొడవ, అదే తేలుతుందిలే."

"విష్ణుమూర్తీ!" అరిచేసింది.

"ఏమయింది, లక్ష్మీ?"

"నీకు తెలియదు మా నాన్న సంగతి. ఆయన తెలివైనవాడు. ముందు నిన్ను లొంగదీశాడు. ఆ పైన నీ ద్వారా సమ్మెని నాశనం చేస్తాడు."

"లక్ష్మీ, అవన్నీ మన కనవసరం."

"అంటే?"

"నువ్వూ, నేనూ...."

లక్ష్మికి తల కొట్టేసినట్టయింది. వెర్రి విష్ణుమూర్తి వైపు చూడలేకపోయింది. విష్ణుమూర్తి ఓ గొప్ప వ్యక్తి అవుతాడనుకుంది. కానీ, తండ్రి అతనిలోంచి మనిషి ప్రవృత్తినే తీసేసి మరమనిషిగా తయారుచేశాడు.

లక్ష్మికి అప్పుడు తండ్రీ, విష్ణుమూర్తీ కూడా ప్రత్యర్థుల్లా కనిపించడం మొదలుపెట్టారు.

సినిమా అయిపోయింది. జనాన్ని వెళ్ళనిచ్చి లక్ష్మీ, నిర్మలా కారెక్కారు. లక్ష్మి కారు డ్రైవు చేస్తూంది. నిద్రపోతున్న పేటలు ఒక్కొక్కటే వెనక్కి వెడుతున్నాయి. అక్కడక్కడా ఎలక్ట్రిక్ పోల్స్ పొడుగాటి శిలువల్లా కనిపించాయి.

లక్ష్మికి సరస్వతీ టెక్స్టయిల్స్ గెస్ట్‌హౌస్ దూరంనుంచే కనిపిస్తూంది. దాని ముందు జనం నీడల్లా నించున్నట్టుగా ఉంది. గాలి ఏవేవో మాటల్ని మోసుకొస్తూంది.

"ఏ గొడవన్నా జరిగిందేమో, లక్ష్మీ!" నిర్మల అంది.

"ఏమో" అంది అనుమానంగా లక్ష్మి.

స్పీడు హెచ్చించింది.

పదిమంది జనం, కొందరు హైక్లాస్ వాళ్ళూ, మరికొంతమంది పోలీసులూ బయట గుమిగూడి వున్నారు. వాళ్ళ మధ్య ఎవరో పడుకున్నారు. లక్ష్మి తల తిప్పి చూసింది. రక్తం డుగులో మనిషి ఎవరయిందీ కనిపించేలోపునే కారు ఆ ఛాయల్ని దాటేసింది. లక్ష్మికి భయం వేసింది. గుండె కీచుమంది.

నిర్మలా వాళ్ళింటి దగ్గర కారు ఆపింది. నిర్మల కారు దిగి, "నే వెడతాను, లక్ష్మీ. ఓ మాట. నువ్వు అనవసరంగా మనసు పాడుచేసుకోకు" అంది.

ఇంటి ముందు కారు ఆపి లోపలికి వెళ్ళి మంచం మీద కూలిపోయింది. ఏదో అనుమానం. వెలితి. ఉండి ఉండి గుండె వేగంగా కొట్టుకుంటూ ఉంది. లేచి వెళ్ళి 'గెస్ట్ హౌస్'కి ఫోన్ చేసింది.

"నేను ఇంటి దగ్గరి నుంచి, లక్ష్మిని మాట్లాడుతున్నాను. ఫాదర్ కావాలి."

"నేనేనమ్మా, లక్ష్మీ, సినిమా అయిపోయిందా?"

"అవున్నాన్నా. నువ్వింట్లో లేకపోతే ఫోన్ చేశాను" అబద్ధం ఆడింది.

"నేనిక్కడే ఉన్నాను. నాకేం భయం లేదు. కానీ,సారీ, లక్ష్మీ, ఐయామ్ వెరి వెరి సారీ. యూనియన్ సెక్రటరీ ఈశ్వరూ, వాళ్ళ జనం వచ్చి విష్ణుమూర్తిని బాగా కొట్టారమ్మా. అతని కండిషన్ ప్రమాదంగా ఉంది."

లక్ష్మి కంగారుగా అడిగింది: "అదేమిటి, నాన్నా, ప్రొద్దున్నే విష్ణుమూర్తిని ఎవరో కొట్టారనీ, ఆసుపత్రికి తీసుకెళ్ళారనీ..."

పరబ్రహ్మం నవ్వేసి, "నీకు తెలుసు కదమ్మా అతన్ని కొట్టలేదని? రాజకీయాలు నీకు చేతనవుతున్నాయి" అన్నాడు. లక్ష్మికి ఏం అర్థం కాలేదు'.

"లక్ష్మీ, విష్ణుమూర్తి నిజంగా చాలా తెలివైన వాడే కాదు. చురుకైన వాడు. లేకపోతే నువ్వు ఏదో సమయంలో ఈశ్వర్ దగ్గరికి వెడతావనీ, తనతో జరిగిన విషయాలు చెబుతావనీ ఊహించగలడంటావా... యూ హెల్ప్‌డ్ మీ యే లాట్. ఈశ్వర్ మేం అనుకున్నట్టుగానే ఆవేశంతో విష్ణుమూర్తి మీదికి వచ్చాడు. చాలు, ఈశ్వర్ అరెస్ట్ అయ్యాడు. ఇక స్ట్రైక్ అంటావా? దాని మలుపులు అది తిరుగుతుంది."

"నాన్నా...."

"నువ్వు భయపడకు. లక్ష్మీ. ఈశ్వర్ మనల్నేం చేయలేడు. విష్ణుమూర్తిలాంటి వాళ్ళు ఉన్నంతవరకూ, మనలాంటి వాళ్ళకి కింద మనుషుల వల్ల ప్రమాదం లేదు. దేవుణ్ణి మనం ప్రార్థించవలసింది విష్ణుమూర్తి లాంటి వాళ్ళని పది కాలాల పాటు రక్షించమని, ఈశ్వర్ లాంటి వాళ్ళని పుట్టించవద్దని అంతే కదూ...."

❖